కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్


బీఎల్ఎఫ్ సమావేశంలో మాట్లాడుతున్న నల్లా సూర్యప్రకాష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బీఎల్ఎఫ్) చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని బీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల జనగణన తర్వాతే రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను 43 శాతానికి పెంచి వర్గీకరించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగ బద్ధ రిజర్వేషన్లు ఉండటం వల్లే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్నత స్థానంలో రాణించగలుగుతున్నారని అన్నారు. దేశ జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు అసెంబ్లీ, పార్లమెంట్ లాంటి చట్టసభల్లో సరైన రిజర్వేషన్లు లేకపోవడం వల్ల వారికి పూర్తిగా అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఎల్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు, ఉపాధ్యక్షులు సబ్బని లత, ఎం.ఎ.గౌడ్, మారోజు సునీల్, ఎం.ఆంజనేయులు, సాయికృష్ణ, సమ్మయ్య, ఆశోక్‌గౌడ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అవసరం


బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్

కాచిగూడ: బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరపాలని బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతానికి పెంచి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణలో కుల గణన చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారని, కులగణన పూర్తి చేసిన తర్వాత బీసీల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 45 శాతం ప్రాతినిధ్యం కల్పించారని, జనరల్ స్థానాలలో బీసీలకు జిల్లా పరిషత్ చైర్మన్, ఎంపీపీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్లు, మేయర్ పదవులు ఇస్తుంటే తెలంగాణలో ఎన్నికల వాగ్దానం ప్రకారం రిజర్వేషన్లు పెంచకుండా అన్యాయం చేయడం తగదన్నారు. రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే పెద్ద ఎత్తున బీసీలు తిరుగుబాటు చేస్తారని భరత్ కుమార్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పొగాకు ఉత్పత్తులు అమ్మొద్దు

పాన్‌షాపుల యజమానులకు ఏసీపీ సూచన


పొగాకు అమ్మకాలపై పాన్‌షాపు యజమానులకు అవగాహన కల్పిస్తున్న కాచిగూడ ఏసీపీ రఘు

కాచిగూడ: పొగాకు ఉత్పత్తులను అమ్మవద్దని పాన్‌షాపుల యజమానులకు కాచిగూడ ఏసీపీ రఘు సూచించారు. బుధవారం కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాన్‌షాపు యజమానులకు బుధవారం పొగాకు ఉత్పత్తుల అమ్మకాలపై ఆయన అవగాహన కల్పించారు. పాన్‌షాపుల్లో పొగాకు ఉత్పత్తులు, డ్రగ్స్, ఈ సిగరెట్లు అమ్మవద్దని సూచించారు. నిర్ణీత సమయానికి పాన్‌షాపులను బంద్ చేయాలన్నారు. నిబంధనలను అతిక్రమించినవారిపై చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కాచిగూడ ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

జూన్ 2 వరకు వీసీలను నియమించాలి


మాట్లాడుతున్న ఎస్.నాగేశ్వర్‌రావు

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల్లో ఖాళీ అయిన వీసీ పదవులను జూన్ 2 వరకు కొత్త వారిని నియమించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగేశ్వర్‌రావు, సుమంత్ మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ తరహా సీఎం రేవంత్‌రెడ్డి కూడా విద్యాశాఖను నిర్వీర్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడిచిన ఇంత వరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం దారుణమన్నారు. విద్యాసంవత్సరం ఆరంభంలో పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలు, పరీక్షలు, ఫలితాలు, వివిధ రకాల ఫీజుల నిర్ణయాలు తదితర కీలక సమయంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఇలాంటి తరుణంలో రాష్ట్రంలోని పది వర్సిటీలకు పర్మనెంట్ వీసీలను నియమించకుండా వివిధ శాఖల విధులతో నిత్యం తీరిక లేకుండా గడిపే ఐఏఎస్ అధికారులను ఇన్‌చార్జి వీసీలుగా నియమిస్తే కార్యక్రమాల్లో జాప్యం జరిగి విద్యార్థులు నష్టపోతారన్నారు. ఈ సమావేశంలో స్వాతి, ప్రశాంత్, సంతోష్, కార్తీక్, మధు, సురేఖ, ప్రవీణ్, మహేష్, శ్రీకాంత్, బాలు పాల్గొన్నారు.

ఐమ్యాక్స్ పక్కన కశ్మీరీ అందాలు!


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న రఫీక్ బేగ్

ఖైరతాబాద్: కశ్మీర్ అందాలను పరిచయం చేస్తూ ఐమ్యాక్స్ పక్కన ఉన్న హెచ్ఎండీఏ మైదానంలో ఏర్పాటు చేసిన సమ్మర్ ఉత్సవ్ మేళా సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. కశ్మీర్‌లోని అనంత్‌వల్లి, మినీ స్విట్జర్‌ల్యాండ్, తులబ్ గార్డెన్, దూద్‌వ్యాలీ వంటి ప్రాంతాలను అద్భుతంగా రూపొందించి మైనస్ డిగ్రీల్లో ఉండే చలిలో ఎగ్జిబిషన్‌లోకి ప్రవేశించేలా ఏర్పాటు చేసిన తీరు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. సందర్శకులు సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ కశ్మీర్‌లో పర్యటించే అనుభూతిని పొందుతున్నారు. గడచిన రెండు దశాబ్దాగా ఏటా వివిధ రకాల అనుభూతులను పరిచయం చేస్తూ ఎగ్జిబిషన్‌లను ఏర్పాటు చేస్తూ వస్తున్న నిర్వాహకుడు మిర్జా రఫీక్ బేగ్ బుధవారం సందర్శకులతో కలిసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. సమ్మర్ ఉత్సవ్ మేళా రోజూ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 11 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

'స్థానిక' ఎన్నికల్లో పోటీ చేస్తాం

ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ

పంజగుట్ట: ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసి త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను నిలబెట్టేందుకు కృషి చేస్తామని పార్టీ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు సింగం శ్రీనివాస్ రావు పార్టీలో చేరగా ఆయనను పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించారు. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయలక్ష్మి, ఉపాధ్యక్షుడు దశరథం, నామిని భాస్కర్, లక్ష్మి, పుష్పాంజలి, నవీన్, రమేష్, పావని, శారద, సరిత తదితరులు పాల్గొన్నారు.


సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన బాలోత్సవం ముగింపు కార్యక్రమంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

పిల్లల్లో నైపుణ్యాన్ని వెలికితీయాలి

బాలోత్సవం ముగింపు సభలో చొక్కాపు వెంకటరమణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి వారి అభివృద్ధికి బాటలు వేయాలని ప్రముఖ విద్యావేత్త చొక్కాపు వెంకటరమణ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం(ఎస్వీకే)లో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించిన శిక్షణతరగతుల ముగింపు సమావేశం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకటరమణ మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు ఆటపాటల్లో కూడా శిక్షణ ఇచ్చి ప్రతిభను వెలికితీయడం అభినందనీయమన్నారు. పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడానికి వేసవికాలం శిక్షణ తరగతులు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఎస్వీకే ట్రస్ట్ కార్యదర్శి ఎస్.వినయకుమార్ మాట్లాడుతూ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపడానికి బాలోత్సవం చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమన్నారు. భవిష్యత్తులో చిన్నారులు ఉత్తమ పౌరులుగా ఎదగడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఎంతగానో అలరించాయి. తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బాలోత్సవం ఉపాధ్యక్షులు కె.సుజావతి, కోశాధికారి జి.బుచ్చిరెడ్డి, మమత, పద్మ, నవీన్, గోపాల్, భవానీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌సీపీడీసీఎల్ 11కేవీ ఆజామ్‌బాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం గురువారం పలు ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. బర్కత్‌పుర ఆర్టీసీ బస్‌డిపో ఫీడర్ పరిధిలో బర్కత్‌పుర బస్‌డిపో, రత్నానగర్, సత్యనగర్, బీజేపీ ఆఫీస్, అవంతి డిగ్రీ కాలేజ్, కాచిగూడ జూనియర్ కాలేజి, ఉడ్‌లాండ్ ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో 11 నుంచి 12.30 గంటల వరకు, సీసీ చరక్ ఫీడర్ పరిధిలో సీసీ చరక్ ఆసుపత్రి, భూమన్నగల్లీ, రాజేంద్రనగర్ కాలనీ, లింగంపల్లి తదితర ప్రాంతాల్లో 12 నుంచి 2 గంటల వరకు, బౌద్ధనగర్ ఫీడర్ పరిధిలో బౌద్ధనగర్, వారాసిగూడ, కౌసర్ మసీద్, జామై ఉస్మానియా మెయిన్ రోడ్డు, బాలాజీ కమ్యూనిటీహాల్ ప్రాంతాల్లో 2.30 నుంచి 4 గంటల వరకు, జామై ఉస్మానియా ఫీడర్ పరిధిలో ఎస్‌బీహెచ్ కాలనీ, లలితానగర్, అడిక్‌మెట్ ఫ్లైఓవర్ తదితర ప్రాంతాల్లో 4 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట: ఓయూలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళాసభ(డీడీఎంఎస్) లిటరసీ హౌస్ అకాడమి క్యాంపస్‌లో స్వల్పకాల కోర్సుల్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. హెర్బల్ ప్రొడక్ట్స్, పేపర్ బ్యాగ్స్ తయారీలో శిక్షణ ఉంటుందని లిటరసీ హౌస్ కార్యదర్శి బి.నాగలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన 18 ఏళ్ల వయసు పైబడినవారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్: 99512 10441, 97010 98541 నంబర్‌లలో సంప్రదించవచ్చు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి జయంతి ఉత్సవం


లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకల్లో పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: బాగ్ అంబర్‌పేట డీడీ కాలనీలో ఉన్న అహోబిల మఠంలో లక్ష్మీనరసింహ స్వామి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. స్వామి వారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు బీఆర్ఎస్ కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. ఈ వేడుకలను వేదపండితులు శ్రీనివాస్‌మూర్తి, మోహన్, మురళి తదితరులు పర్యవేక్షించారు.

పద్మారావుగౌడ్ విజయం ఖాయం: ఎమ్మెల్యే


జైసింహ, హారిక దంపతులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

చిక్కడపల్లి: బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ వివాహ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం పార్టీ నాయకులు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై జైసింహ, హారిక దంపతులను ఆశీర్వదించారు. అనంతరం ఆయన నాయకులతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ ఎంపీ స్థానాన్ని బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ గెలవడంతో పాటు పార్టీ 10 స్థానాలు కైవసం చేసుకుంటుదని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేష్‌కుమార్, నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీనివాస్‌గుప్తా, సత్యనారాయణ, పాశం రవి, శ్రీకాంత్, పి.సుధాకరం, డైని, శ్యామ్‌యాదవ్, గోవిందు, ఆనంద్‌కుమార్, భాస్కర్, సంపత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీసంగీత విభావరి


అక్కిరాజు యోగిత సత్కరిస్తున్న స్నేహ హసంతి. నల్లూరి రమ్య, గోవార్ధన్, వినయ్

చిక్కడపల్లి: శార్వ మ్యూజిక్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కల్చరల్ సెంటర్‌లో బుధవారంరాత్రి నిర్వహించిన సినీసంగీత విభావరి పలువురిని అలరించింది. గాయనీ, గాయకులు ఇందు, దివ్య, ప్రతిభ, వినయ్, హరి, శోభన్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డి, శరత్ ఆలపించిన మధుర గీతాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఆ సందర్భంగా నిర్వాహకులు స్నేహ హసంతి, గాయనీ గాయకులు నల్లూరి రమ్య, అక్కిరాజు యోగిత, గోవార్ధన్‌లను సత్కరించారు.

అక్రమ స్లాబ్ కూల్చివేత

వెంగళరావునగర్: జీహెచ్ఎంసీ నిబంధనలు పాటించకుండా నిర్మించిన బహుళ గృహ సముదాయం స్లాబ్‌ను అధికారులు బుధవారం కూల్చివేశారు. వివరాలివీ... వెంగళరావునగర్ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో పద్మావతి అనే మహిళ ఇంటిని నిర్మిస్తుంది. ఆమెకు జీహెచ్ఎంసీ కేవలం జీ ప్లస్ త్రీ భవనం నిర్మాణానికి మాత్రమే టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతి ఇచ్చారు. అయితే ఆమె నిబంధనలను ఉల్లంఘిస్తూ మరో అంతస్తును నిర్మించింది. దాంతో అదే కాలనీలో ఉన్న శాంతి జ్యోతి అనే మహిళ జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. దీనికి స్పందించిన సర్కిల్–19 టౌన్ ప్లానింగ్ అధికారులు ఆమెకు నోటీసులు జారీ చేశారు. అయినా సదరు యజమాని వినకుండా మరో అంతస్తును నిర్మించారు. దాంతో ఉన్నతాధికారులకు తెలియజేయగా జోనల్ కార్యాలయం ఇంజినీరింగ్ విభాగం ప్రత్యేక అధికారులు బుధవారం తన సిబ్బందితో వచ్చి అదనంగా ఉన్న స్లాబ్ నిర్మాణాన్ని తొలగించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ నిబంధనలు పాటించకుండా బహుళ అంతస్తులు నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓయూకు మాల ప్రొఫెసర్‌ను వీసీగా నియమించాలి


భాగ్యరెడ్డివర్మ జయంతిలో పాల్గొన్న విద్యార్థి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు మాల కులానికి చెందిన ప్రొఫెసర్‌ను వీసీగా నియమించాలని ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ (అంసా) అధ్యక్షులు నామ సైదులు డిమాండ్ చేశారు. నిజాం నవాబ్ పాలనలో విద్యాశాఖ మంత్రిగా పని చేసిన మాలకులానికి చెందిన భాగ్యరెడ్డివర్మ 136వ జయంతిని బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట నిర్వహించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ.. భాగ్యరెడ్డివర్మ విద్యావ్యాప్తిగా చేసిన కృషి మరువలేనిదని అన్ని సామాజిక వర్గాలతో కలిసి చేసే తత్వం గల మాలలకు ఓయూ వీసీ పదవీ ఇవ్వాలన్నారు. తెలంగాణ మాల మహానాడుతో పాటు ఇతర మాల సంఘాల మద్దతుతో గత అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ ఓయూకు మాల ప్రొఫెసర్‌ను వీసీగా నియమిస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఎస్ఎం శ్రీకాంత్‌యాదవ్, ఉదయ్, గోపి, బసవరాజు, శ్రీను, దామోదర్ పాల్గొన్నారు.

భార్యతో గొడవపడిన వ్యక్తి అదృశ్యం


రాజన్ పాశ్వాన్

కాచిగూడ: ఇంట్లో భార్యతో గొడవపడిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్.ఐ. డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రాజన్ పాశ్వాన్(24) భార్య అంబిక పాశ్వాన్‌తో కలిసి సుల్తాన్‌బజార్‌లో ఉంటున్నాడు. మూడేళ్ల క్రితం వీరికి వివాహమైంది. రాజన్ పాశ్వాన్ గోకుల్‌ధామ్ వద్ద కారుడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భార్యతో గొడవపడి ఈ నెల 14న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబసభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు భార్య అంబిక పాశ్వాన్ బుధవారం కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పాతకక్షలతో దాడి.. ఇద్దరికి గాయాలు

కాచిగూడ: పాతకక్షలతో దాడిచేసి ఇద్దరిని గాయపర్చిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... యాకత్‌పురకు చెందిన ఎండీ ఫయాజ్‌ఖాన్, అతని స్నేహితుడు మొసిన్ బుధవారం డబీర్‌పుర రైల్వేస్టేషన్‌లో ఉండగా వారిపై దావూద్ బాబ్రి(26), రహ్మాన్(25) కత్తులతో దాడి చేసి గాయపర్చారు. వీరిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పాతకక్షలతోనే దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

కాచిగూడ: రైల్లోంచి దూకి గాయపడిన బాలిక చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బుధవారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... కాచిగూడ రైల్వేస్టేషన్‌లో రాజ్‌మొహల్లాకు చెందిన రమేష్ తన ఇద్దరు కూతుళ్లు పూజ(15), విజయ(14), కుమారుడు, సోదరుడి మనవరాళ్లతో కలిసి రైలు ఎక్కే క్రమంలో రమేష్ కింద పడిపోయాడు. తండ్రి పడిపోవడంతో కూతుళ్లు నడుస్తున్న ఎంఎంటీఎస్ రైలు నుంచి కిందకు దూకారు. దీంతో పూజ కుడి చెయ్యి విరిగిపోయింది. విజయ తలకు బలమైన గాయంతో పాటు వెన్నముక విరిగిపోవడంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ విజయ మృతి చెందింది.

తల్లీకుమార్తెల అదృశ్యం


అదృశ్యమైన తల్లి, కూతురు

ఖైరతాబాద్: తల్లి కూతుళ్లు కనిపించకుండా పోయిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎఎస్ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం.... బంజారాహిల్స్‌లో రోడ్‌నెం 10లో నివాసముండే ఆటోడ్రైవర్ మహ్మద్ నవాజ్, భార్య ఆయేష బేగం(35), కూతురు సమ్రీన్(12)తో కలిసి మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఆటోలో అత్త ఇంటికి వెళ్తున్నారు. వీరు వెళ్తున్న ఆటో ఖైరతాబాద్ ఫ్లై ఓవర్ మీదకు రాగానే ఆటోలోంచి కిందకు దిగిన ఆయేష తనను కిడ్నాప్ చేస్తున్నాడని కాపాడాలంటూ అరిచింది. దీంతో దారిలో వెళ్తున్న ప్రయాణికులు ఆటో డ్రైవర్‌ను పట్టుకొని ఆమెను మరొక ఆటోలో పంపించారు. చివరగా వారిద్దరు భార్యాభర్తల గొడవ అని తెలియడంతో ప్రయాణికులు అక్కడినుంచి వెళ్లిపోయారు. దీంతో నవాజ్ ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భార్యను రెండవ వివాహం చేసుకున్నానని, మొదటి భర్తకు పుట్టిన పాప పుట్టిన తరువాత వారిద్దరు విడిపోయారని, ఆ తరువాత తాను పెళ్లి చేసుకున్నానని, బ్యూటీషియన్‌గా పనిచేసే తన భార్య వారి అమ్మ ఇంటికి వెళ్దామంటే ఆటోలో వెళ్తున్నామని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆటోలోంచి వెళ్లిపోయిన సమయంలో ఆమె ఫోన్ కూడా తీసుకువెళ్లలేదని, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఫలితం అక్కడకు కూడా రాలేదని తెలుపడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. తల్లి, కూతుళ్ల ఆచూకీ తెలిస్తే ఖైరతాబాద్ పోలీసులకు తెలియజేయాలని తెలిపారు.

ఉద్యోగం కోసం రూ. 20 పంపితే ఆన్‌లైన్‌లో రూ.20 వేలు మాయం

వెంగళరావునగర్: ఉద్యోగం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే మహిళ నుంచి నగదు కాజేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... రహమత్‌నగర్ గురుద్వార్ గల్లీలో నివాసం ఉండే వి.త్రివేణికి ఈ నెల 2న ప్రైవేట్ సంస్థ నుంచి మెయిల్ వచ్చింది. ఉద్యోగం కావాలంటే రూ. 20 పంపాలని సూచించారు. ఆమె తన క్రెడిట్ కార్డు ద్వారా రూ. 20 పంపగా వెంటనే దాంతో పాటుగా రూ. 20,560 నగదు డెబిట్ అయినట్టుగా మెసేజ్ వచ్చింది. ఆమె ఆందోళన చెంది ఎస్‌బీఐకి వెళ్ల నగదు హోల్డ్ చేయమని కోరింది. బ్యాంకు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ కాపీ తీసుకురావాలని కోరారు. ఈ నెల 18న సైబర్ క్రైమ్ నుంచి ఎఫ్ఐఆర్ కాపీ తీసుకుని బ్యాంకుకు పంపింది. అయితే బ్యాంకు మాత్రం సకాలంలో ఎఫ్ఐఆర్ కాపీ తీసుకురానందున హోల్డ్‌లో ఉంచలేకపోయామని ఆమెకు తెలియజేశారు. దాంతో త్రివేణి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


విరిగిన ప్రవేశ ద్వారం

అధికారుల నిర్లక్ష్యం.. అసాంఘిక కార్యక్రమాలకు నిలయం

ఉస్మానియా యూనివర్సిటీ: అధికారుల నిర్లక్ష్యంతో ఓయూ క్యాంపస్‌లోని ఉద్యానాలు అధ్వానంగా, అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతున్నాయి. అందమైన పువ్వులు, వివిధ రకాల మొక్కలతో సుందరంగా కనిపించే గార్డెన్లు విరిగిన గేట్లు, తిరిగిన బోర్డులతో కళావిహీనంగా మారుతున్నాయి. సిబ్బంది కొరతతో వర్సిటీలోని గార్డెన్లు నిరుపయోగమై రాత్రుల్లో బయటి వ్యక్తుల అశ్లీల కృత్యాలకు నిలయంగా మారుతున్నాయి. విద్యార్థులు సేద తీరేందుకు క్యాంపస్‌లోని న్యాయ కళాశాల ఎదుట ల్యాండ్ స్కేప్ గార్డెన్‌ను ప్రత్యేకంగా నిర్మించారు. చిన్నలేక్‌తో సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ గార్డెన్ క్యాంపస్‌లోనే పెద్దది. దీని నిర్వహణ కోసం గతంలో 25 మంది సిబ్బంది ఉండగా ప్రస్తుతం కేవలం 12 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఇది వరకు బయటి వ్యక్తులు ప్రవేశించకుండా పగలు, రాత్రి 24 గంటలు వాచ్‌మెన్ కాపాలా ఉండేవారు. సిబ్బంది కొరతతో వాచ్‌మెన్లను తొలగించడతో బయటి వ్యక్తులు వచ్చి సిబ్బంది హట్‌లో అసాంఘిక కార్యక్రమాలు జరుపుతున్నట్లు సమాచారం. గార్డెన్ల నిర్వహణపై దృష్టి సారించి బయటి వ్యక్తులు రాకుండా వాచ్‌మెన్లను నియమించాలని విద్యార్థి నేతలు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.


విరిగిన బోర్డు